క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా ఎం. తబ్‌రేజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన ఆయన 2002 బ్యాచ్ ఎస్ఐగా అనంతపురం జిల్లాలో పనిచేశారు. 2017లో సీఐగా పదోన్నతి పొంది కర్నూలు జిల్లాలో పలు చోట్ల సీఐగా విధులను నిర్వహించారు. కర్నూలు త్రీటౌన్ నుంచి కడప టూటౌన్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా బదిలీ అయ్యారు.

అన్నదానం

కడప ఎడ్యుకేషన్: కడప చెన్నూరు బస్టాండ్ సమీపంలోని వికాస్ విహార్ రాస్ ఎంఆర్ చిల్డ్రన్ మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో శుక్రవారం మానవతా సంస్థ సభ్యులు, విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు కల్లూరు బాలయల్లారెడ్డి తన తండ్రి కల్లూరి చిన్న ఎల్లారెడ్డి జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తన సహచరులైన విశ్రాంతి డిప్యూటీ ఈఓ నాగమునిరెడ్డి, జాస్తి మల్లికార్జున, సుబ్బారాయుడులతో కలిసి పిల్లలకు భోజనాన్ని వడ్డించారు.

బార్మీ అన్నదానం

కడప వైఎస్ఆర్ సర్కిల్: అన్నదానం పుణ్య కార్యమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని పాత బస్ స్టాండ్ ఆవరణంలో సీఐటీయూ పాత బస్టాండ్ హమాలి యూనియన్ అధ్యక్షుడు షేక్ మస్తాన్ వల్లి ఆధ్వర్యంలో బార్మీ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హమాలి యూనియన్ నాయకులు మస్తాన్, బక్సు , షేక్షా తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ మాటలు అర్థరహితం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమికి, లౌకికవాద ఇండియా పక్షానికి సమదూరంలో ఉంటామని తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేసిన ప్రకటన అర్థరహితమని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. అమిత్‌షా మాటలు నమ్మి బీజేపీ వలలో పడితే తెలుగుదేశం నష్టపోవడం తప్ప సాధించేదేమీ ఉండదన్నారు. ఇండియా కూటమిలో చేరుతారా లేదా అనేది తెలుగుదేశం పార్టీ ఇష్టమని, కానీ సమదూరం పేరుతో మతోన్మాద బీజేపీకి సానుకూలంగా వ్యవహరించడం ప్రమాదకరమని చెప్పారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు వైవీయూ విద్యార్థిని

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవాపథకం యూనిట్-1 వలంటీర్ జీవీఎల్ కౌసల్య ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ వేడుకలు ఎంపికయ్యారు. ఇటీవల వైవీయూలో నిర్వహించిన విశ్వవిద్యాలయ పోటీల్లో కౌసల్యను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకట్రామిరెడ్డి అభినందించారు.

భక్తి శ్రద్ధలతో నాతియా ముషాయిరా



నాతియా ముషాయిరాలో పాల్గొన్న నగర ముస్లిం ప్రముఖులు

కడప కల్చరల్ : మిలాదున్నబీని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి స్థానిక ఎల్ఎఫ్ వీధిలోని అస్తానె హుసేనియా పీఠంలో స్థానిక కవులతో నాతియా ముషాయిరా నిర్వహించారు. అస్తానె హుసేనియా పీఠాధిపతి సయ్యద్‌షా మహమ్మద్ షహజాద్ హుసేనీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ఉద్దేశాన్ని వివరించారు. మహా ప్రవక్త జీవిత విశేషాలు, బోధనలు, అనుసరించిన విధానం గురించి నేటి తరానికి తెలిపేందుకు ఈ ముషాయిరా ఎంతో ఉపయోగపడగలదన్నారు. కార్యక్రమం నిర్వహించడం, పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అనంతరం కవి సమ్మేళనం జరిగింది. పలువురు కవులు తమ నాత్ గీతాలతో ప్రవక్త గుణ గణాలను కొనియాడారు. స్థానిక ప్రముఖులు సయ్యద్ మహమ్మద్ ఫైజాన్ హుసేనీ, రిజ్వాన్ హుసేనీ, ముఫ్తీ మౌల్వి హజరత్ వలీవుల్లా హుసేనీ సాహెబ్, ముఫ్తీ హజరత్ మహమ్మద్ అలీ బొగ్దాది, ముఫ్తీ న్యామతుల్లా, నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఎం జిల్లాస్థాయి శిక్షణ తరగతులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు శనివారం, ఆదివారం నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చ ఉంటుందన్నారు. శిక్షణ తరగతులను సీపీఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఏ.రామ్మోహన్, బి.దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



అమ్మవారిశాల వద్ద ఏర్పాటు చేసిన ఆర్చి



శ్రీ విజయదుర్గాదేవి ఆలయ ఆవరణలో విద్యుత్ దీపాల శోభ

కడప కల్చరల్ : దేవి నవరాత్రి ఉత్సవాలకు కడప నగరంలో వేదికలు సిద్ధమయ్యాయి. శుక్రవారం రాత్రికి దాదాపు అన్ని అమ్మవారి ఆలయాల వద్ద రంగురంగుల భారీ పందిళ్లు, కళ్లు చెదిరే విద్యుద్దీపాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

ఆదివారం ఉదయం నుంచి దసరా ఉత్సవాలను వేద పండితుల పూజలతో ఆలయాలలో శాస్త్రోక్తంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా 9 రోజులపాటు ప్రతి ఆలయంలో అమ్మవారికి విశేష అలంకారం నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. భక్తులు అమ్మవారిని సులభంగా దర్శించుకునేందుకు కూడా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలు కొనసాగే రోజులలో అమ్మవారి ఆలయాలవద్ద భక్తుల సందడి కనిపించనుంది. సంవత్సరంలో 10 రోజులపాటు జరిగే అతి పెద్ద పండుగ గనుక ఉత్సవాల నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కడప నగరంలో ..

నగరంలోని అమ్మవారిశాలతోపాటు శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో అత్యంత భారీగా ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. నగరంలో దాదాపు 50కి పైగా చిన్న, పెద్ద అమ్మవారి ఆలయాలు ఉన్నాయి. అందులో ప్రధానంగా గంగమ్మ, పోలేరమ్మ, చౌడేశ్వరీమాత, మారెమ్మతల్లి ఆలయాలు ఉన్నాయి.

విజయదుర్గమ్మకు నవరాత్రి వైభవం



మాట్లాడుతున్న సుధా మల్లికార్జునరావు

కడప శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో ఆదివారం నుంచి తొమ్మిది రోజులపాటు శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నామని ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌రావులు తెలిపారు. శుక్రవారం ఆలయ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. తొమ్మిది రోజులు రోజుకొక అలంకారం , ప్రతిరోజు ఆలయ ప్రాంగణంలో సంప్రదాయ నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు.

అలంకారాలు .. ఆలయంలో ఈనెల 15న శ్రీ విజయదుర్గాదేవిని శైలపుత్రిగా, 16న బ్రహ్మచారిణి, 17న చంద్రఘంట, 18న కుష్మాండదేవి, 19న స్కంధమాత అలంకారం నిర్వహిస్తామన్నారు. 20వ తేదిన అమ్మవారిని కాత్యాయినిగా, 21న కాళరాత్రిగా, 22న మహాగౌరీగా, 23న సిద్ధిదాత్రిగా, అదేరోజు రాత్రి అమ్మవారు ఊరేగింపుగా శమీ దర్శనం చేస్తారని, రాత్రి 8 గంటల నుంచి నగరోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



పెండ్లిమర్రి : ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



వల్లూరు : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మందుల కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో జుబేద

పెండ్లిమర్రి : పేద ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్‌లు తెలిపారు. మండలంలోని రంపతాడు గ్రామ సచివాలయం పరిధిలోని ఎగువపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని వారు తనిఖీ చేసి రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయాలన్నారు. తీవ్ర అనారోగ్య సమస్యలు ఉంటే మెరుగైన సేవల కోసం వేరే అసుపత్రికి రేఫర్ చేయాలని వైద్యులకు సూచించారు. మారు మూల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే అకాంక్షతోనే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈపథకాన్ని అమలు చేశాడన్నారు. దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రజలకు ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజ, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

వల్లూరులో...

వల్లూరు : మండలంలోని పైడికాలువ గ్రామ సచివాలయ పరిధిలోని ఆర్‌సీఎం పాఠశాల ఆవరణలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మొత్తం 370 మందికి వైద్య సేవలను అందించినట్లు ఎంపీడీవో జుబేద, తహశీల్దార్ శంకర్‌రావు తెలిపారు. వైద్య నిపుణుల ఆధ్వర్యంలో 146 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలను నిర్వహించారు. 88 మందికి కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. 9 మందిని ఉన్నతస్థాయి వైద్య సేవలకై రెఫర్ చేశారు. అవ్వా తాత కార్యక్రమం కింద 48 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం మందులను, ఆయుస్మాన్ భవ ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ రవీంద్రనాథరెడ్డి, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పుష్పగిరిలో పిండ ప్రదానం

వల్లూరు : పుష్పగిరి కొండపైన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలో పవిత్ర పెన్నా నది ఒడ్డున రుద్రపాద ఆలయం వద్ద శనివారం పితృదేవతలకు అత్యంత ప్రీతికరమైన మహాలయ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక పిండ ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం వుంటుందన్నారు. కుల మతాలతో సంబంధం లేకుండా ఎవరైనా తమ పితృదేవతలకు పిండ ప్రదానం చేయవచ్చునని తెలిపారు. దేవస్థానం తరుపున పిండ ప్రదానానికి కావాల్సిన పసుపు, కుంకుమ, ఆకు, వక్కలు, పూలు, ఊది బత్తీలు, కర్పూరము, విస్తర్లు, బియ్యం, నువ్వులు, దర్బ మొదలైన సామగ్రిని ఉచితంగా అంద జేస్తామన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

చెన్నూరు : కేసీ కెనాల్ కింద పంటలు సాగుచేయని రైతులు తమపంట పొలాలలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఎర్రసాని మోహన్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్‌లు శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన రైతులకు ఖరీఫ్ పంటలపై అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మండలంలోని, ఆయా రైతు భరోసా కేంద్రాలలో విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయని వారు తెలిపారు.

అలరించిన నృత్య ప్రదర్శన

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో పిల్లలకు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలను అలవాటు చేయాలని కార్పొరేటర్ శ్రీనివాసులరెడ్డి అన్నారు. శుక్రవారం కడప నగర కమిషనర్ ఆదేశాల మేరకు ఏక్ భారత్ - శ్రేష్ఠ భారత్‌లో భాగంగా సంస్కృతి మహోత్సవాల కార్యక్రమాన్ని కడప నగరం చెమ్మియాపేట బాలికల హైస్కూల్లో నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ గిరిజ, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం మేరీ, సీఆర్పీ నాగమణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ పోటీల్లో కాంప్లెక్స్ పరిధిలోని 13 పాఠశాలలకు చెందిన జూనియర్స్, సీనియర్స్ విద్యార్థులకు పాటలు, నృత్యం, పెయింటింగ్, డ్రామా తదితర పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ స్కూల్ హెచ్ఎం బాలనాయుడుతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు

వైవీయూలో అమృత కలశ యాత్ర



వైవీయూ ప్రధాన ద్వారం వద్ద అమృత కలశ యాత్రలో వలంటీర్లు

వైవీయూ : దేశభద్రత కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులైన సైనికుల జ్ఞాపకార్థం పవిత్ర మట్టి, బియ్యం సేకరించి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రదర్శన నిర్వహించారు. శుక్రవారం వైవీయూలో ఎన్ఎస్ఎస్ యూనిట్-9 ఆధ్వర్యంలో 'మేరీమట్టీ.. మేరీ దేశ్' కార్యక్రమంలో భాగంగా అమృత్ కలశ్‌యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. కె. శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం బియ్యం, మట్టి నింపిన కుండలతో వలంటీర్లు విశ్వవిద్యాలయ ప్రధాన ద్వారం వద్ద ప్రదర్శన నిర్వహించారు.

కళాశాల గుర్తింపును రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని చాపాడు మండలంలో ఉన్న ఫ్రెండ్స్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ బీఈడీ కళాశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కళాశాలలో స్కూల్‌ను నడుపుతూ పరీక్ష సమయంలో మాస్ కాపియింగ్‌కు పాల్పడుతున్నారని, సంబంధిత కళాశాలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం వైవీయూ వీసీ చింతా సుధాకర్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.

క్రీడాకారుడికి అభినందన

కడప స్పోర్ట్స్: ఎస్‌జీఎఫ్ యోగ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా అండర్-14 జట్టుకు కడప నగరంలోని చెమ్ముమియాపేట బాలుర ఉన్నత పాఠశాల క్రీడాకారుడు బి. శివకేశవ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గిరిజకుమారి, ఫిజికల్ డైరెక్టర్ ఎం.ప్రవీణ్‌కిరణ్ తెలిపారు. ఈనెల 12న కడప నగరంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపికల్లో చక్కటి ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు.

17న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఈనెల 17వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. వివిధ హోదాలలో పనిచేసేందుకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీ.ఎం, డి.ఫార్మసీ, డిప్లొమా చదివిన అభ్యర్థులు ఇందుకు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ. 11-25 వేల వరకు హోదాను బట్టి వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులకు సంబంధించిన విద్యార్హతల ధృవపత్రాలతో ఈ జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

వైవీయూలో విద్యార్థి సంఘాల నిరసన



వైవీయూలో నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

వైవీయూ : కృష్ణాజలాల వివాదాలపై కేంద్రమంత్రి వర్గం తీసుకున్న నిర్ణయంతో రాయలసీమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, తద్వారా సీమ ఎడారిగా మారుతుందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి. దస్తగిరి పేర్కొన్నారు. శుక్రవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా మిగులు జలాల వివాదాలపై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారమే మిగులు జలాలను దృష్టిలో ఉంచుకుని రాయలసీమలో ప్రాజెక్టులు కట్టారన్నారు. మిగులు జలాల వినియోగంపై వాజ్యం సుప్రీంకోర్టులో నడుస్తున్న సమయంలోనే తెలంగాణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం బ్రిజేష్ ట్రిబ్యునల్ తీర్పును అమలుచేయాలని నిర్ణయం తీసుకోవడం రాయలసీమకు మరణశాసనం లాంటిదన్నారు. ఇప్పటికే రాయలసీమ కరువు కాటలతో ఉందని, ఈ నిర్ణయంతో ఎడారిగా మారుతుందన్నారు. కావున కేంద్రమంత్రివర్గ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి శివనాగేంద్ర, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి శివ, చంద్ర, మహేశ్వరరెడ్డి, కిరణ్, మహీంద్రా తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబులు డిమాండ్ చేశారు. రాష్ట్రశాఖ ఇచ్చిన పిలుపు మేరకు జీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కడపలోని యూటీఎఫ్ భవన్‌లో పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మమద్, అడ్ కమిటి కన్వీనర్ ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

- నగరపాలక కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరాభివృద్ధికి ప్రజలంతా కులమతాలకు అతీతంగా సహకరించాలని నగరపాలక కమిషనర్ ఎస్.ఎస్ ప్రవీణ్‌చంద్ కోరారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఆర్‌డీఓ ధర్మచంద్రారెడ్డి, తహసీల్దార్ శివరామిరెడ్డి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, డివిజన్ ఇన్‌చార్జులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప నగరంలో రహదారులను విస్తరించి, డివైడర్లు, గ్రీనరీ పెంచి సరికొత్త రూపు తెచ్చేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామన్నారు. వాహనాల సంఖ్య విపరీతంగా పెరగడంతో ట్రాఫిక్ రద్దీ ఎక్కువయ్యిందన్నారు. రోడ్లు ఇలాగే ఉంటే రానున్న రోజుల్లో వాహనాలు వెళ్లడం కూడా కష్టమవుతుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా వాసి కావడం వల్ల రహదారుల విస్తరణ వల్ల ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారికి నష్ట పరిహారం, అభివృద్ధి నిధులు వెనువెంటనే మంజూరు చేశారన్నారు. కడప నగరం ఇప్పుడు అభివృద్ధి కాకపోతే మరెప్పుడూ అయ్యే అవకాశం లేదన్నారు. విస్తరణ వల్ల ఇప్పటికిప్పుడు కొంత నష్టం జరిగినా భవిష్యత్‌లో ఎంతో మేలు జరుగుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఈ అభివృద్ధి పనులు ఎంత త్వరగా పూర్తయితే కడపలో అభివృద్ధిని అంత త్వరగా చూడవచ్చన్నారు. సోమవారం మత పెద్దలతో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

14 నుంచి శిక్షణా తరగతులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 14, 15న అనంతపురంలోని ఇందిరానగర్ గణేష్ నాయక్ భవన్‌లో నిర్వహించే రాయలసీమ శిక్షణా తరగతులు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పిలుపునిచ్చారు. శుక్రవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లా ఆఫీస్ బేరర్స్, కమిటీ సభ్యులు, అన్ని రంగాల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, నాయకులు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జి శ్రీనివాసులు రెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కడప సెంట్రల్ జైల్లో ఆధార్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్

కడప వైఎస్ఆర్ సర్కిల్: పోస్టల్ ఆధార్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా కడప సెంట్రల్ జైల్లో ఖైదీల కోసం పోస్టల్ ఆధార్ క్యాంప్‌ను ప్రారంభించారు. కడప సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ ఎన్‌హెచ్ ప్రకాష్ అభ్యర్థన మేరకు జైల్ లోని ఖైదీల ఆధార్ కోసం క్యాంప్ ను ఏర్పాటు చేశామని రాజేష్ పేర్కొన్నారు. ఈ ఆధార్ క్యాంప్‌లో ఆధార్ అప్డేట్, కొత్త ఆధార్‌లను చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్‌లు విజయ భాస్కర్, రెడ్డిబాషా, పీఎల్ఐ డెవలప్‌మెంట్ మేనేజర్ మునాఫ్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

వీణా విద్వాంసుడు చిట్టిబాబుకు నివాళి

కడప కల్చరల్ : మన దేశంలోని సంగీత రంగంలో సుప్రసిద్ధ వైణికుడు చిట్టిబాబుతో ఆ వాయిద్యానికి మరింత గౌరవ మర్యాదలు ఏర్పడ్డాయని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు పేర్కొన్నారు. శుక్రవారం ప్రసిద్ధ వీణా విద్వాంసుడు చల్లపల్లి చిట్టిబాబు 88వ జయంతి సందర్భంగా బ్రౌన్ కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి , డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ సినీ సంగీత రంగంలోనే కాకుండా ప్రపంచంలోని చాలా దేశాలలో చిట్టిబాబు వీణా వాదనను ఆ ప్రాంత ప్రజలు ఆస్వాదించడం విశేషమన్నారు. పలు సినిమాలకు నేపథ్య సంగీతం అందించి తనదైన ముద్ర వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.